క్లుప్తంగా

ఆరు గ్యారంటీల అమలులో విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని: ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. మంథనిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల్లో ఒక్క ఉచిత ప్రయాణం తప్ప ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదన్నారు. పథకాల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ఈ నెల 14 నుంచి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజా వంచన దినాలు పేరుతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో వేగోళపు శంకర్‌గౌడ్, గుజ్జుల రాజిరెడ్డి, పూదరి సత్యనారాయణ, నూనె కుమార్ పాల్గొన్నారు.

ముందస్తు బాలోత్సవం వేడుకలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ స్పందన మోడల్ స్కూల్‌లో 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ముందస్తు బాలోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు కవిత, రచన, నాటికలు, జానపద నృత్యాలతో ఆకట్టుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు స్కూల్ యజమాన్యం బహుమతులు అందించింది. కరస్పాండెంట్ ఓదెలుయాదవ్, హెచ్‌ఎం రవీందర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామ పరిధిలోని రాంనగర్‌కు చెందిన గడ్డం కనుకయ్యకు గ్రామానికి చెందిన పలువురు కలిసి మంగళవారం రూ.13,516 అందజేశారు. ఇటీవల కనుకయ్య ఇంట్లో జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భార్య, అత్త సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఈ మేరకు కనుకయ్యకు ఆర్థికసాయం అందజేశారు. మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు, అల్లి రమేష్, బత్తిని ప్రశాంత్, రాజేశం, రాజు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు



జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఎన్టీపీసీ ప్రాంతంలోని రాజీవ్ రహదారి సర్వీసు రోడ్డు పక్కన ఉన్న ముళ్లపొదల తొలగింపు చేపట్టారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) అరుణశ్రీ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్ రాథోడ్, సూపర్‌వైజర్ వంగర సంపత్ మంగళవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. దీనిలో భాగంగా రహదారి పక్కనున్న ముళ్ల పొదలను తొలగించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

జ్యోతినగర్: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడల్లో ఎన్టీపీసీ రామగుండం విశ్వభారతి హైస్కూల్ విద్యార్థి రోహిత్‌వర్మ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 8వ తరగతి చదువుతున్న రోహిత్ వర్మ ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 వరకు ఖమ్మంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ ప్రవీణ్, హెచ్‌ఎం తిరుపతిగౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

ధర్మారం: మండలంలోని ఎర్రగుంటపల్లి బస్టాండ్ నుంచి బొమ్మారెడ్డిపల్లి ఎక్స్‌రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్, డివైడర్లు ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు సంఘం మండల ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ నాయకుడు కొత్త మోహన్ ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఎర్రగుంటపల్లి గ్రామ శివారులో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి హాజరైన లక్ష్మణ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. స్పందించిన విప్ వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.

మూడునెలల్లో బండలవాగు పూర్తి చేస్తాం

- నెలాఖరుకల్లా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లింపు
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల రైతులకు సాగునీరు అందించే బండలవాగు ప్రాజెక్ట్‌ను వచ్చే మూడునెలల్లో పూర్తిచేస్తామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మండల పరిధిలోని వేంనూర్‌లో మక్కాన్‌సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్తీక వనభోజనాలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి గాను అంతర్గాం, పాలకుర్తి రెండు మండలాలకు ఒక్కో మండలానికి రూ.10కోట్ల చొప్పున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. మక్కాన్‌సింగ్ సేవాసమితి అధ్యక్షురాలు మనాలీఠాకూర్, కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, పాలకుర్తి మాజీ ఎంపీపీ గంగాధర రమేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, నాయకులు పొన్నం సత్తయ్య, బుద్దె గంగయ్య, తోట ప్రశాంత్, నెలకంటి రాము, శ్రావణ్ పాల్గొన్నారు.

కాలానుగుణంగా సాగు చేయాలి

రామగుండం: కాలానుగుణంగా సాగు పనులు చేపడితే నాణ్యమైన దిగుబడి వస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. అంతర్గాం మండలం విసంపేట, పొట్యాల, సోమనపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం గుంటూరుపల్లిలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ధాన్యం కొనుగోళ్లలో తరుగు తీయకుండానే మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు.

భూనిర్వాసితులకు ఉపాధిపై స్పష్టత ఇవ్వాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ నిర్మాణంలో భూములు కోల్పోయిన ప్రభావిత, పునరావాస ప్రాంతంలోని ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, మౌళిక వసతులు కల్పించే అంశంపై ఎన్టీపీసీ సంస్థ యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని ఓ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావుతో కలిసి మాట్లాడారు. 29న తెలంగాణ స్టేజ్–2 నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ విషయంలో జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణకు ముందు వారం రోజులు నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజాభిప్రాయ సేకరణలో యాజమాన్యాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు. కార్పొరేటర్లు శ్రీనివాస్, కృష్ణవేణి, ఎన్టీపీసీ పట్టణ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ్, నాయకులు వీరాలాల్, చందు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు న్యాయం చేయాలి

గ్రీన్ కారిడార్ పేరుతో మేడిపల్లి సెంటర్‌లో చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించిన వారికి వీధి వ్యాపారుల కోసం నిర్మించిన షెడ్లు కేటాయించి వారిని ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. మంగళవారం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో నిర్మించిన దుకాణాల వద్ద డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు శ్రీనివాస్, కృష్ణవేణి, నాయకులతో కలసి నిరసన తెలిపారు.

మంత్రిని కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



మంత్రికి మొక్క అందిస్తున్న అన్నయ్యగౌడ్

సుల్తానాబాద్: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ మంగళవారం కరీంనగర్‌లో కలిసి మొక్క అందించారు. కాంగ్రెస్ కోసం నిరంతరం పనిచేసిన వారికి అధిష్టానం ఎప్పుడూ అండగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులపై ఉందని మంత్రి సూచించారని అన్నయ్యగౌడ్ తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు యాత్రలు



మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మంథని: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై బీజేపీ డిసెంబర్‌లో తిరుగుబాటు యాత్రలు చేపట్టనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మంథనిలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఆచరణకు నోచుకోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రజా అభీష్టం మేరకు తిరుగుబాట యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు ఆర్ముళ్ల పోచం, క్యాతం వెంకటరమణ, పోల్సాని సంపత్‌రావు, కందుల సంధ్యారాణి, గొట్టిముక్కల సురేశ్, మేర్గు హన్మంత్‌గౌడ్, మచ్చగిరి రాము, కొండపాక సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో అడిషనల్ కలెక్టర్ పూజలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ డి.వేణు మంగళవారం పూజలు చేశారు. దేవస్థానం ఈవో సదయ్య ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి చిత్రపటం బహూకరించి శాలువాతో సన్మానించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీకాంత్, తహసీల్దార్ యాకన్న, ఆర్ఐలు రమేశ్, మహేశ్ ఉన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పాలితం గ్రామంలో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట నిర్వహించారు. విద్యుత్ పరమైన సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ గ్రామ రైతులను జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ బొంకూరి సుదర్శన్ అడిగి తెలుసుకున్నారు. విద్యుత్‌పరంగా రైతులు ఏమైనా సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబరు 1912కు సమాచారం అందించినా సమస్యకు పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. అధికారులు తిరుపతి, రవి, రవిచందర్ ఉన్నారు.

అర్హులందరూ బ్యాంకురుణాలు పొందండి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలో అర్హులైన స్వశక్తి సంఘాల మహిళలు బ్యాంకురుణాలు పొంది స్వయం ఉపాధి పొందాలని ఐకేపీ ఏపీఎం సంది నర్సమ్మ అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల పరిధిలో గ్రామాల వారీగా రుణాలు పొందే వారి అర్హుల జాబితా రూపొందించాలని సూచించారు. ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రజిని, మండల సమాఖ్య అధ్యక్షురాలు లావణ్య హాజరయ్యారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

పెద్దపల్లిరూరల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 64మందికి నేత్రపరీక్షలు నిర్వహించగా 26మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. వారిలో 16మంది ముందుకు రాగా రేకుర్తి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయిస్తామని క్లబ్ అధ్యక్షుడు రమేశ్ తెలిపారు. ప్రతినిధులు రాజగోపాల్, రాంకిషన్, సత్యనారాయణ, సుష్మ, శశాంక, మహేందర్‌రావు పాల్గొన్నారు.

గాయత్రీలో హెల్త్‌క్యాంపు

పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్‌లో విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు రాజ్‌కుమార్, ఆంథోనిరెడ్డి, నవీన్, దత్తాగౌడ్ అబ్దుల్‌వాసే, విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్ పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి..

మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. కమిషనర్ వెంకటేశ్‌తో పాటు సిబ్బంది, కార్మికులు పరీక్షలు చేయించుకున్నారు. మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్, టీపీవో వినయ్, శ్రీశైలం, రమాకాంత్, దీక్షిత్, బాలు, శ్రీనివాస్ ఉన్నారు.

బేగంపేట పీహెచ్‌సీ తనిఖీ

రామగిరి: మండలంలోని బేగంపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్న కుమారి తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. 30ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరికి బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలు డిసెంబర్ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీ పరిధిలో 70శాతం చేసినట్లు వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌వోను సిబ్బంది సన్మానించారు.

భూనిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఆవరణలో నిర్మిస్తున్న నూతన ప్రాజెక్టులో భూనిర్వాసితుల కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎన్టీపీసీ భూనిర్వాసిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆయన వినతిపత్రం అందించారు. 29న జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో విద్యార్హతలను బట్టి భూనిర్వాసితుల కుటుంబసభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి రేగొండ శ్రీనివాస్, అట్ల ప్రభాకర్, కొమురయ్య, తిరుపతి, కుమారస్వామి, భూనిర్వాసితులు పాల్గొన్నారు.

- **ఎమ్మెల్యేను కలిసిన అధికారులు**

గోదావరిఖని: ఎన్టీపీసీ అధికారులు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను కలిశారు. 2,400 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు కృషి చేసినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

- **పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి**

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రామగిరి మండలం సింగిరెడ్డిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగిరెడ్డిపల్లి గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్‌బాబు, ఎస్సై రాజేశ్ సిబ్బందితో కలిసి పేకాట స్థారంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న 9మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.71,690 నగదు, 4 బైక్‌లు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని విచారణ నిమిత్తం గోదావరిఖని టూటౌన్ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

- **శిథిలావస్థకు చేరిన భవనాల పరిశీలన**

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ప్రమాదకరంగా శిథిలావస్థలో ఉన్న గదులను తొలగించేందుకు మంగళవారం ఎంపీడీవో ఎంఏ.అలీం క్షేత్ర పరిశీలన చేశారు. త్వరలోనే శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యదర్శి నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

- **ఎల్‌వోసీ అందజేత**

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన కొల్లూరి సుధాకర్‌కు మంత్రి శ్రీధర్‌బాబు మంజూరు చేయించిన రూ.లక్ష25వేల విలువ గల ఎల్‌వోసీ మంగళవారం అందజేశారు. సుధాకర్ మోకాలు శస్త్రచికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. వైద్యసాయం కోసం మంత్రికి విన్నవించగా ప్రభుత్వం నుంచి ఎల్‌వోసీ మంజూరు చేయించారు.

సంక్షిప్త వార్తలు

- **రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు**

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్‌లోని రైస్‌మిల్ అసోసియేషన్ వద్ద గల రాజీవ్ రహదారిపై మంగళవారం బైక్ మీద వెళ్తున్న కాల్వశ్రీరాంపూర్ పెగడపల్లికి చెందిన కృష్ణమూర్తి ట్రాక్టర్‌ను ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ కేశవపట్నం నుంచి ట్రాక్టర్ ధాన్యం లోడ్‌తో సుల్తానాబాద్ వస్తుండగా రైస్‌మిల్ అసోసియేషన్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా బైక్‌పై కరీంనగర్ వైపు వెళ్తున్న కృష్ణమూర్తి ఢీకొన్నాడు. గాయపడిన కృష్ణమూర్తిని వైద్యం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

- **ఏబీవీపీ నాయకుల రాస్తారోకో**

సుల్తానాబాద్: బాసర ట్రిపుల్ ఐటీ వద్దకు వెళ్తున్న ఏబీవీపీ నాయకులపై దాడి చేసిన సెక్యూరిటీ సిబ్బందిపై చర్య తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, రాసూరి ప్రవీణ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట రాజీవ్ రహదారిపై ఏబీవీపీ నాయకులు రాస్తారోకో చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు రాస్తారోకో విరమింపజేశారు. నగర ఉపాధ్యక్షుడు వినయ్, నాయకులు మెరుగు సిద్ధార్థ, గణేశ్, ఆశిష్, సంజయ్, వంశీసాయి, కార్తీక్ పాల్గొన్నారు.

- **మహిళల రక్షణకోసం షీటీమ్**

కాల్వశ్రీరాంపూర్: మహిళలు, బాలికల రక్షణ కోసం షీటీమ్స్ ఉన్నాయని కాల్వశ్రీరాంపూర్ ఎస్సై వెంకటేశ్ అన్నారు. మల్యాల మోడల్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం ఎస్సై పలు అంశాలపై అవగాహన కల్పించారు.

- **కులగణన సర్వేకు సహకరించాలి**

రామగిరి: కులగణన సర్వే కోసం ఇంటికి వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని మంథని డీఎల్‌పీవో సతీశ్ కోరారు. మండలంలోని బేగంపేట, నవాబ్‌పేటలో జరుగుతున్న సర్వేను మంగళవారం ఆయన తనిఖీ చేశారు.

ఎలిగేడు: మండలంలోని శివపల్లిలో జిల్లా మత్స్యశాఖ, మండల ప్రత్యేక అధికారి రమేశ్‌కుమార్ రాయుడు సర్వేను పరిశీలించారు. మండలంలో మంగళవారం 840 ఇళ్ల సర్వే చేసినట్లు అధికారులు తెలిపారు.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలో సమగ్ర కుటుంబ సర్వే ఇప్పటి వరకు 36శాతం పూర్తయిందని ఎంపీడీవో దివ్యదర్శన్ తెలిపారు. మండలంలోని నర్సయ్యపల్లిలో జరుగుతున్న సర్వేను మంగళవారం ఎంపీడీవో పరిశీలించారు.

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో సమగ్ర సర్వేను మంగళవారం జిల్లా సీపీవో అధికారి గంప రవీందర్ ఎంపీడీవో పద్మజతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలో ఇంటింటి సమగ్ర సర్వే సాఫీగా సాగుతోంది. ఇప్పటివరకు 6,649 ఇళ్లలో సర్వే పూర్తయిందని ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ఫయాజ్ తెలిపారు.

- **కొనుగోలు కేంద్రం ప్రారంభం**

మంథని: మండలంలోని గంగపురి, అంగ్లూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం మంథని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ ప్రారంభించారు.

- **సింగరేణి అధికారులపై సీఎండీకి ఫిర్యాదు**

రామగిరి: సమాచార హక్కు చట్టంలో సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్నా.. సమాచారనివ్వడం లేదని మండలంలోని నాగేపల్లికి చెందిన గోపాలకృష్ణ మంగళవారం సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌కు ఫిర్యాదు చేశారు.

గర్రెపల్లి విండో చైర్మన్‌ను సస్పెండ్ చేయాలి

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: భూమి కొనుగోలు పేరిట గర్రెపల్లి సింగిల్‌విండో సొమ్మును కాజేసిన చైర్మన్ జూపల్లి సందీప్‌రావును పదవి నుంచి తొలగించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తంగళ్లపల్లి రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పగులకొట్టిన స్లాబ్ పెచ్చులు(బండరాళ్లు) దారికి అడ్డుగా ఉన్నాయి. దీంతో 108 వాహనం వెళ్లేందుకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడిది. వర్షాకాలంలో బురదగా మారడంతో పగులగొట్టిన స్లాబ్ పెచ్చులు పోయగా వాటిని చదును చేయకపోవడంతో 108 వాహన సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

పర్యావరణ పరిరక్షణలో సింగరేణి భేష్



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తరుణ్ కత్తుల, జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: పర్యావరణ పరిరక్షణలో సింగరేణి పనితీరు అభినందనీయమని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ, వాతావరణ మార్పుల డైరెక్టర్ తరుణ్ కత్తుల ప్రశంసించారు. మూసివేసిన మేడిపల్లి ఓసీపీని మంగళవారం పరిశీలించారు. పర్యావరణ క్లియరెన్స్ కండిషన్స్, మైన్ క్లోజర్ యాక్టివిటీస్ అంశాలు పరిశీలించారు. తొలుత ప్రభావిత మేడిపల్లిలో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ పరిశీలించి మొక్కలు నాటారు. మేడిపల్లి, లింగాపూర్‌లో రోడ్ల నిర్మాణం సోలార్ లైట్ల పనితీరుపై ఆరా తీశారు. మేడిపల్లి ఓసీపీని వ్యూపాయింట్ ద్వారా సందర్శించారు. అనంతరం తిలక్‌నగర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సందర్శించారు. పలు అంశాలపై జీఎం కార్యాలయంలో సమీక్షించారు. జీఎం లలిత్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ జీఎం సైదులు, ఏజెంట్ రమేశ్, అధికారులు రవికిరణ్, శ్రీనివాసు, ఆంజనేయప్రసాద్, కర్ణ, మల్లికార్జున్‌యాదవ్ ఉన్నారు.

సులభ్ కార్మికులకు లాభాల వాటా ఇవ్వాలి



ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి ఆర్జీ–1 ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు సులభ్ కార్మికులకు లాభాల వాటా అందజేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్జీ–1 జీఎం ఆఫీస్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి డీజీఎం పర్సనల్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకన్న, ఉపాధ్యక్షుడు బి.అశోక్ మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల లాభాల వాటా అందజేశారన్నారు. కానీ ఆర్జీ–1 ఏరియాలో పనిచేస్తున్న సులభ్ కాంట్రాక్టు కార్మికులకు ఇప్పటివరకు అందజేయలేదన్నారు. వీరిని సింగరేణి యామాన్యం గుర్తించి లాభాల వాటా రూ.5వేలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఇ.నరేశ్, సులభ్ కార్మికులు కోట వెంకన్న, బానయ్య, నవీన్, మల్లేశ్వరి, సంతోష్‌కుమార్, సమ్మయ్య పాల్గొన్నారు.

విశ్వభారతిలో సైన్స్‌ఫెయిర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి హైస్కూల్‌లో మంగళవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్‌ఫెయిర్ దోహదపడతాయన్నారు. అనంతరం ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు తిలకించారు. హెచ్‌ఎం తిరుపతిగౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, టీచర్లు పాల్గొన్నారు.

పటిష్టంగా రక్షణ చర్యలు



మాట్లాడుతున్న డీడీఎంఎస్ వెంకన్న

గోదావరిఖని: పనిస్థలాల్లో రక్షణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని సింగరేణి డీడీఎంఎస్ వెంకన్న సూచించారు. జీవీటీసీలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

ఖాళీ పోస్టులను వెంటనే భర్తీచేయాలి

గోదావరిఖని: సర్ఫేస్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పదినెలల క్రితం మంజూరైన సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టుల్లో మెడికల్ కోటా 23 పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. అదేవిధంగా టెక్నీషియన్ కార్మికులు ముఖ్యంగా ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ కార్మికుల కొరత తీవ్రంగా ఉన్న దృష్ట్యా ఆ ఖాళీలను డిప్యూటేషన్లతో కాకుండా పర్మినెంట్‌గా కార్మికులను వెంటనే నియమించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికుడు బత్తుల లక్ష్మయ్యను మంగళవారం సన్మానించారు. కంపెనీ కార్మికుల విశ్రాంతి గదిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, కంపెనీ హెచ్‌ఆర్ అధికారులు సదానందం, కట్టికోల శ్యాంకుమార్ లక్ష్మయ్యను సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. కార్మికసంఘం నాయకులు పెరుమాండ్ల రమేశ్, సాదిక్‌పాషా, ములకనూరి శ్రీధర్, ఆకుల కొమురయ్య, పూసాల ప్రసాద్, కాంపెల్లి సుధాకర్, సది, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఇసుక లారీల పట్టివేత

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మంథని ప్రాంతం నుంచి ఇసుకను ఓవర్‌లోడ్‌తో తీసుకెళ్తున్న లారీలను మంగళవారం విజిలెన్సు అధికారులు పట్టుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్న లారీలను స్థానిక రవాణా అధికారి కార్యాలయంలో భద్రపరిచారు.

ప్రతీరోజు వ్యాయామం చేయాలి

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–2లో మంగళవారం కార్మికులకు మధుమేహంపై ఏరియా ఆస్పత్రి వైద్యులు పద్మ అవగాహన కల్పించారు. మధుమేహం వ్యాధిబారిన పడడానికి గల కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. ప్రతీరోజు వ్యాయమాం చేయాలని సూచించారు. అధికారులు రామారావు, నాయకులు రాంచంద్రారెడ్డి, రామిళ్ల మనోహర్, నాగేశ్వరరావు, ఆసిఫ్, మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే మొబైల్ టీం ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు కంటిచూపుపై అవగాహన కల్పించారు. వైద్యులు విజయ్‌కుమార్, ఐశ్వర్య పాల్గొన్నారు.